క్లుప్తంగా

పరామర్శ


బీఆర్‌ఎస్ నాయకుడు మాధవ్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ మాధవ్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పి.సబితారెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చేవెళ్లలో పార్టీ సమావేశానికి హాజరైన ఆమె సమావేశం అనంతరం మల్కాపూర్‌కు వెళ్లి మాధవ్‌రెడ్డిని కలిసి పరామర్శించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, నాయకులు ఆంజనేయులు, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, శివప్రసాద్, గోపాల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాన్నున స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సత్తాచాటాలని, కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

కడ్తాల్: పరిధి చరికొండలో గాదమోని విజేందర్‌గౌడ్ స్మారకార్థం మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత పోలే అర్జున్‌టీం, రన్నరఫ్ భీష్మాచారి జట్లకు విజేందర్‌గౌడ్ బాల్యమిత్రులు నగదు బహుమతితో పాటు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ స్పాన్సర్స్ శేఖర్, రామకృష్ణగౌడ్, నాయకులు మహేందర్‌గౌడ్, భీష్మాచారి, బాలకృష్ణగౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదగిరిగౌడ్, శ్రీశైలంయాదవ్, సచిన్‌గౌడ్, ఆర్గనైజర్స్ కృష్ణ, తరుణ్, శ్రీరామ్, రఘు, చింటూ, లింగం, హరిచంద్ర, రాజేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి

కందుకూరు: సమాజ శ్రేయస్సు కోసం ఆర్‌ఎస్ఎస్ నిరంతరం పనిచేస్తోందని అఖిల భారతీయ సహ సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, ముఖ్యఅతిథి విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎడ్ల బాబురావు అన్నారు. ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మండల పరిధిలోని కొత్తగూడలో సంఘ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1925లో స్థాపించిన ఆర్‌ఎస్ఎస్ నేటికీ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉందన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించి ఆదర్శ హిందూ గృహం లక్షణాల్ని పాటిస్తూ ధర్మనీరతి కోసం కుటుంబ జీవనాన్ని సాగించాలని కోరారు.

శక్తి స్వరూపిణీ నమోస్తుతే

- ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు
- పూజల్లో పాల్గొన్న భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు

షాద్‌నగర్: దేవీ నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయం, పతంజలి యోగా కేంద్రం, కోటమైసమ్మ దేవాలయం, మొగిలిగిద్ద, ఎలికట్ట భవానీ మాత దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలికట్ట దేవాలయంలో నిర్వహించిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

షాబాద్ మండలంలో..

షాబాద్: షాబాద్, తాళ్లపల్లి, మల్లారెడ్డిగూడ, హైతాబాద్, మద్దూరు, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో దుర్గామాతలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవారు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో, వాడవాడలా దేవాలయాల్లో పదో రోజు దుర్గామాత మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, పసుపు కుంకుమలు సమర్పించారు. పలు మండపాల వద్ద కుంకుమార్చన, హోమం, పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించారు.


షాద్‌నగర్: భవానీమాత దేవాలయంలో అమ్మవారి పల్లకీసేవలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


షాద్‌నగర్‌రూరల్: పూజల్లో పాల్గొన్న ఎంపీడీఓ బన్సీలాల్‌ను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు


షాబాద్: సర్దార్‌నగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్ నర్సింలు, గ్రామస్తులు


మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులు


షాద్‌నగర్: పతంజలి యోగా కేంద్రంలో పూజలో పాల్గొన్న భక్తులు

నేతల ఆశలు ఆవిరి!

- రిజర్వేషన్లలతో పలువురి నాయకుల భవిష్యత్ తారుమారు
- అన్ని పార్టీల నేతల్లో ఆందోళన, కొత్తవారికి అవకాశాలు
- మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలకు, 25 పంచాయతీలకు మొదటి విడతలోనే ఎన్నికలు



గ్రామ పంచాయతీ కార్యాలయం

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగటంతో గ్రామాల్లో ఎన్నికల హడావిడి మొదలైంది. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల మార్పుతో ఆశావాహుల్లో ఆందోళన నెలకొంది. అధికార పార్టీ నాయకులు గత రెండు సంవత్సరాల నుంచి గ్రామాల్లో సొంత నిధులతో పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వారితో మమేకమయ్యారు. రిజర్వేషన్ల తారుమారుతో నాయకుల ఆశలన్నీ అడియాశలయ్యాయి. మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు, 25 పంచాయతీలు, 218 వార్డులు ఉన్నాయి. మొత్తం 35,438 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 17,231 మంది, మహిళలు 17,706, ఇతరులు ఒకరు ఉన్నారు. ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 63 పోలింగ్ బూత్‌లు ఉండగా.. పంచాయతీ ఎన్నికలకు వార్డుకు ఒక్కటి చొప్పున 218 పోలింగ్ స్టేషన్‌లు నిర్ణయించారు.

ఎన్నికల షెడ్యూల్

మండలంలో ఎన్నికలు మొదటి విడతలోనే అక్టోబర్ 23న ఎంపీటీసీ, నవంబర్ 4న పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల, 9వ తేదీ నుంచి 11వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ, 12న పరిశీలన, 13న అభ్యంతరాల స్వీకరణ, 14న అభ్యంతరాల పరిశీలన, 15న ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన, 23న పోలింగ్, నంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇక పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 11న నోటిఫికేషన్ విడుదల, 21వ తేదీ నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, 25న అభ్యంతరాల స్వీకరణ, 26న అభ్యంతరాల పరిశీలన, 27న ఉపసంహరణ, తుదిజాబితా ప్రకటన, నవంబర్ 4న పోలింగ్. అదే రోజు మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాలు విడుదల ఉంటాయి.

నాయకుల్లో నిరుత్సాహం

మండలంలో విడుదలైన రిజర్వేషన్లతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమకు అవకాశాలు వస్తాయని ఎదురుచూస్తూ ఇప్పటికే అందరినీ పలకరించి దావత్‌లు సైతం చేసుకొని సిద్ధంగా ఉన్న నాయకుల ఆశలు ఆవిరయ్యాయి. మండలంలోని దాదాపు 90 శాతం పాత నాయకులు ఈ రిజర్వేషన్లతో అవకాశాలను కోల్పోయారు. ఏ అవకాశం కూడా కలిసిరాని నాయకులు రిజర్వేషన్‌లు తమ భవిష్యత్తు నాశనం చేశాయని వాపోతున్నారు. కాకపోతే వాడీవేడి వాతవారణం మాత్రం ఈ ఎన్నికల్లో కనిపించే పరిస్థితి లేకుండాపోయింది. మండలంలో ఒక్కటి రెండు గ్రామాల్లోనే గట్టి పోటీ నాయకులు కనిపిస్తుండడంతో మండలంలోని సీనియర్ పార్టీ నాయకులే ఈ ఎన్నికల్లో గ్రామాల్లో పోటీదారులను సమన్వయం చేయాల్సి వస్తుంది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఎవరిని పోటీలో ఉంచాలి. ఎవరు ఉంటే మండల పదవులకు పోటీ పడతారానే ఆలోచనలో అన్ని పార్టీల నాయకత్వం నిమగ్నమైంది.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలకు గాను 2 ఎస్సీలకు(ఒకటి మహిళకు), బీసీలకు 4(2 మహిళలకు), జనరల్ 4(2మహిళలకు) కేటాయించారు.

ఎంపీటీసీ స్థానం(పరిధిలోని పంచాతీలు)	రిజర్వేషన్
న్యాలట (న్యాలట, సింగప్పగూడ, తలారం)	ఎస్సీ(మహిళ)
ముడిమ్యాల(ముడిమ్యాల, రావులపల్లి, కుమ్మెర, గొల్లపల్లి)	ఎస్సీ
ఖానాపూర్(ఖానాపూర్, రేగడిఘనాపూర్, దేవరాంపల్లి, నాంచేరి)	బీసీ
చనువెళ్లి (చనువెళ్లి, బస్తేపూర్, మిర్జాగూడ)	బీసీ(మహిళ)
ఎన్కేపల్లి (ఎన్కేపల్లి, కమ్మెట, ఈర్లపల్లి, గొల్లగూడ)	బీసీ(మహిళ)
తంగడపల్లి(తంగడపల్లి)	బీసీ
ఆలూరు-1	జనరల్
ఆలూరు-2	జనరల్
గుండాల(గుండాల, అల్లవాడ)	జనరల్(మహిళ)
అంతారం(అంతారం, కౌకుంట్ల, హస్తేపూర్)	జనరల్(మహిళ)

పంచాయతీల రిజర్వేషన్లు..

పంచాయతీలకు సంబంధించి 25 పంచాయతీలకు గాను ఎస్సీలకు 06 (మూడు మహిళలకు), బీసీలకు 11(మహిళలకు 5 స్థానాలు), జనరల్‌కు 08 మహిళలకు 4 స్థానాలు) కేటాయించారు.

పంచాయతీలు	రిజర్వేషన్
అల్లవాడ, కుమ్మెర, ఖానాపూర్	ఎస్సీ(మహిళ)
న్యాలట, అంతారం, నాంచేరి	ఎస్సీ(జనరల్)
హస్తేపూర్, ఆలూరు, బస్తేపూర్, దేవరంపల్లి, ఎన్కేపల్లి	బీసీ(మహిళ)
గొల్లపల్లి, కమ్మెట, ముడిమ్యాల, చనువెళ్లి, గుండాల, తంగడపల్లి	బీసీ(జనరల్)
గొల్లగూడ, మిర్జాగూడ, రావులపల్లి, రేగడిఘనాపూర్	జనరల్(మహిళ)
తలారం, ఈర్లపల్లి, కౌకుంట్ల, సింగప్పగూడ	జనరల్

గిరిజనులకు అవకాశం కల్పించాలి

ఆర్డీఓకు లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుల వినతి

షాద్‌నగర్: నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజనులకు కనీసం ఒక్క ఎంపీటీసీ స్థానం అయినా కేటాయించాలని షాద్‌నగర్ ఆర్డీఓ సరితకు బుధవారం లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌లో మండలంలో గిరిజనులకు ప్రభుత్వం ఒక్క ఎంపీటీసీ స్థానం కూడా కేటాయించ లేదన్నారు. నందిగామ మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వీటి పరిధిలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపారు. 9 స్థానాల్లో ఒక్కటి కూడా గిరిజనులకు కేటాయించకపోడం శోచనీయమన్నారు. ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. గిరిజనులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో లంబాడీ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్, అయోధ్య శ్రీనివాస్, పరశురాం తదితరులు ఉన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


పెద్దమంగళారంలో కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

పనులు చేయరు.. స్పందించరు

మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన పెద్దమంగళారం గ్రామస్తులు

మొయినాబాద్: ఆరు నెలలకుపైగా వీధి దీపాలు లేవు.. మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండిపోయినా పట్టించుకోరు.. రోడ్ల గుంతల పడ్డా పట్టదు.. ఫోన్ చేస్తే స్పందించరు.. మున్సిపల్ అధికారులు ఏం పనిచేస్తున్నారంటూ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌పై పెద్దమంగళారం గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో మాజీ సర్పంచ్ నరోత్తంరెడ్డితో పాటు గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేశారు. దీంతో ఆయన అక్కడికి చేరుకోవడంతో స్థానికులు ఒక్కసారిగా కమిషనర్‌ను నిలదీశారు. గ్రామంలో వీధి దీపాలు లేవని.. దసరా పండుగ సందర్భంగా వీధి దీపాలు వేయాల్సి ఉన్నా మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గ్రామంలో మురుగు కాలువలు నిండిపోయి దుర్వాసన వస్తున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు సమస్యలు పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బతుకమ్మ ఏర్పాట్లతో పాటు గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని.. మురుగు కాల్వలు, వీధులు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రం చేయడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని, బతుకమ్మ వేడుకల నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పి పనులు మొదలు పెట్టడంతో గ్రామస్తులు శాంతించారు. సాయంత్రానికి బతుకమ్మ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లు చేశారు.

రిజర్వేషన్‌లలో ఎస్సీలకు అన్యాయం

కొత్తూరు: ఎంపీటీసీ వ్యవస్థ ఏర్పాటు నుంచి నేటివరకు ఇన్ముల్‌నర్వలో ఉన్న ఎస్సీలకు రిజర్వేషన్‌లలో అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింలు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామంలో సుమారు 800 ఎస్సీ కుటుంబాలు, 550కి పైగా ఓటర్లు ఉన్నప్పటికీ ఎందుకు ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎస్సీలు జనాభా, ఓటర్ల పరంగా అధికంగా ఉన్నప్పటికీ రిజర్వేషన్లు మాత్రం దక్కడం లేదని వాపోయారు.

సద్దుల సంబురం

మొయినాబాద్: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బతుకమ్మ పాటలతో గ్రామాలలు మార్మోగాయి. బుధవారం మున్సిపల్ పరిధిలోని సురంగల్, పెద్దమంగళారం, హిమాయత్‌నగర్ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను వదిలారు.

షాబాద్‌లో..

షాబాద్: మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారు చేసి ఆడిపాడారు. అవినాశ్‌రెడ్డి సతీమణి పట్నం సాన్విరెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సతీమణి శ్రుతిరెడ్డి తదితరులు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.


మొయినాబాద్: సురంగల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మతో చిన్నారులు


బతుకమ్మలతో మహిళలు


మొయినాబాద్: హిమాయత్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు